ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజం



అఫ్జల్‌గంజ్: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని వాణిజ్య పన్నుల శాఖ చార్మినార్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం గగన్‌విహార్‌లో పదవీ విరమణ పొందిన అసిస్టెంట్ కమిషనర్ చంద్రమోహన్‌ను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..ప్రతి ఉద్యోగి, ప్రతి అధికారి వారు పనిచేసే ప్రాంతాల్లో ప్రజలతో కలిసిమెలసి గడిపే సమయాలు, ప్రజలకు ఉన్నతమైన విధులు అందించే అంశాలు అందరికీ ఎల్లప్పుడు గుర్తుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మెహిదీపట్నం సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథం, జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓ పోస్టులను పదోన్నతులతో భర్తీ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం రాష్ట్ర కార్యవర్గం

సుల్తాన్‌బజార్: పీహెచ్‌ఎన్ టు సీహెచ్‌ఓ, హెచ్‌ఈఓ టు సీహెచ్‌ఓగా పదోన్నతులు కల్పించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు నెహ్రూ చంద్ నాయక్, ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీధర్ రెడ్డి, కోశాధికారి మహలమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ డీడీ శ్వేత మొంగకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..మల్టీ జోన్ 1, 2లో ఉన్న సీహెచ్‌ఓ ఖాళీ పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని కోరినట్లు తెలిపారు. ఇప్పటికే చాలా సీహెచ్‌ఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు.

పొగాకు నిర్మూలనపై అవగాహన ర్యాలీ

యాకుత్‌పురా: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏక్తా జనశక్తి ఫౌండేషన్, స్థానిక యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం దారుషిఫాలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగాకు నిర్మూలన, సిగరెట్ తాగడంతో వచ్చే పొగను ఇతరులు పీల్చడంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు రాజేష్ యాదవ్, యూపీహెచ్‌సీకి చెందిన రామేశ్వరీ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా కట్టమైసమ్మ ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు

లంగర్‌హౌస్: కట్టమైసమ్మ ఆలయ పునః ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ బోనాల ఉత్సవాలు ప్రారంభమయ్యే గోల్కొండ బోనాల ప్రారంభం సందర్భంగా బుజిలి మహంకాళి అనంతరం కట్టమైసమ్మ ఆలయం వద్దే రెండవ పూజ నిర్వహించి ఊరేగింపును ముందుకు సాగనంపడం ఆనవాయితీ. లంగర్‌హౌస్ బుజిలీ మహంకాళి ఆలయ చైర్మన్ బోగి పరమేష్ కుమార్ ఆధ్వర్యంలో కట్టమైసమ్మ ఆలయ పునఃప్రారంభ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సంగం ఆలయం నుంచి కట్టమైసమ్మ వరకు కళాకారులు, డప్పువాయిద్యాలతో అమ్మవారి విగ్రహాన్ని ఆటపాటలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో లంగర్‌హౌస్ పెద్దలు ఆరెళ్ల రమేష్ యాదవ్, శ్రీధర్ గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

శరీర దారుఢ్యానికి ఇంజెక్షన్ల విక్రయం

వ్యక్తి అరెస్ట్



అబ్దుల్ జిబ్రాన్ అన్సారీ

చాంద్రాయణగుట్ట: శరీర దారుఢ్యం కోసం ప్రమాదకరమైన ఇంజక్షన్లను సరఫరా చేస్తున్న వ్యక్తిని సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసారావు వివరాల ప్రకారం..మహ్మద్‌నగర్‌కు చెందిన వెల్డింగ్ పనిచేసే అబ్దుల్ జిబ్రాన్ అన్సారీ(30) సులభంగా డబ్బులు సంపాదించేందుకు ఉత్ప్రేరకాలను సరఫరా చేసేవాడు. హరియాణకు చెందిన సాహెంద్ర ప్రసాద్ అనే వ్యక్తి నుంచి మెఫెంటర్మైన్ సల్ఫేట్ బాటిళ్లను కొనుగోలు చేసి శరీర కండలు పెంచాలనే ఆసక్తి ఉన్న యువతను లక్ష్యంగా చేసుకొని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. యాక్టివా వాహనంపై బండ్లగూడ అనుమానాస్పద స్థితిలో సంచరిస్తున్న ఇతని కదలికలపై విశ్వసనీయ సమాచారం అందుకున్న సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదబాబు, బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ గురునాథ్ బృందం శుక్రవారం రాత్రి అరెస్ట్ చేసింది.

పూడికతీత పనుల కూలీల బతుకులింతేనా..?

- కనీస వేతనాలు, రేషన్‌కార్డులు కరువు
- పూడికతీత, డ్రైనేజీ మరమ్మతుల సందర్భంగా తలెత్తుతున్న సమస్యలు
- కనీస వేతనాలతో పాటు సౌకర్యాలు కల్పించాలంటున్న కార్మికులు



పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

చార్మినార్: ఎలాంటి ముందు జాగ్రత్తలు లేకుండా అడ్డా కూలీలు ప్రమాదకరంగా పని చేస్తున్నారు. రోజంతా కష్టించి పని చేసినా ఒక్కోసారి కనీస వేతనాలు కూడా దొరకని దుర్భర పరిస్థితుల్లో కూలీలున్నారు. శాశ్వత గృహ నిర్మాణాలతో పాటు రేషన్ కార్డులు, కనీస వేతనాల అమలు, ప్రమాద బీమా, పింఛన్లు తదితర సమస్యల పరిష్కారానికి అప్పుడప్పుడు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళుతున్నా వారి గోడు వినిపించుకునే వారే కరువయ్యారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు తమ అవసరాల కోసం సమస్యలను పరిష్కరిస్తామంటూ సభలు, సమావేశాలకు తీసుకువెళ్లడమే తప్పా.. ఆయా సమస్యల పరిష్కారానికి ప్రయత్నించిన సందర్భాలు లేవు. సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రతిరోజూ పేద కూలీలు దొరికిన వాహనాల్లో కూర్చొని ప్రమాదపుటంచున ప్రయాణిస్తున్నారు.

ముందు జాగ్రత్తలు లేకుండా..

జీహెచ్‌ఎంసీ, జలమండలి డ్రైనేజీ నాలాలో పేరుకుపోయిన పూడికతీత పనుల సందర్భంగా ఎలాంటి ముందు జాగ్రత్తలు లేకుండా పని చేస్తున్నారు. కొన్ని చోట్ల డ్రైనేజీ మురుగు మ్యాన్‌హోళ్లలో ఎంతో కాలంగా పూడికతీత పనులు జరుగకపోవడంతో నాలా కింది భాగంలో విష వాయువులుండే ప్రమాదం పొంచి ఉంది. డ్రైనేజీ పూడికతీత పనుల సందర్భంగా విషవాయువులు వెలువడి పేద కూలీలు మృతి చెందిన సంఘటనలు గతంలో చోటుచేసుకున్న విషయం తెలిసిందే. నాలాల్లో పూడికతీత పనులు చేపట్టేప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటే ప్రమాదాల నుంచి పేద కార్మికులను రక్షించడానికి వీలు కలుగుతుంది. జీహెచ్‌ఎంసీ, జలమండలి ఆధ్వర్యంలోని డ్రైనేజీ మురుగునీటి కాలువలు, మ్యాన్‌హోళ్లల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించడానికి వీరిని కాంట్రాక్టర్లు, అధికారులు డైలీ వేజ్ కింద వినియోగిస్తున్నారు. మ్యాన్‌హోళ్లకు జరిగే మరమ్మతు పనుల్లో సైతం కార్మికులు ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా పని చేస్తున్నారు.

శోభాయాత్ర



శోభాయాత్రలో బీజేపీ నాయకులు

గౌలిపురా: పుణ్యశ్లోక, రాజమాత అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది జయంతిని పురస్కరించుకొని శనివారం బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజుల రెడ్డి ఆధ్వర్యంలో మహిళలతో కలిసి శోభాయాత్రను నిర్వహించారు. ఈ శోభాయాత్ర హనుమాన్‌నగర్ మంగళముఖి హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన ఛత్రినాక, లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారి ఆలయం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి డి.ప్రదీప్, బీజేపీ జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఆలే భాస్కర్‌తో పాటు నాయకులు గోలీకర్ ధీరజ్‌లాల్, ఆదర్శ మహేశ్, కౌడి సురేందర్, పుప్పాల మధుసూదన్, పొన్న వెంకటరమణ, గౌలిపురా డివిజన్ మాజీ అధ్యక్షులు జి.రఘుకాంత్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దశావతారం నాటక ప్రదర్శన



కళాకారులతో మామిడి హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: వేసవి సెలవుల్లో పిల్లలకు శాస్త్రీయ సంగీత కళలపై శిక్షణా శిబిరాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తింగపంగ థియేటర్ ఆధ్వర్యంలో సమ్మర్ చిల్డ్రన్స్ థియేటర్ వర్క్‌షాప్ ముగింపు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులచే దశావతారం అనే నాటకాన్ని ప్రదర్శించారు. అనంతరం మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..నాటకాల ద్వారా పిల్లల్లో సృజనాత్మకత, కళాత్మకత దృష్టి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రంగస్థల నటుడు ఖాజాపాషా, తింగపంగ థియేటర్స్ వ్యవస్థాపకులు తింగపంగ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



పండల హరినాథ్ గౌడ్ అచీవ్‌మెంట్ అవార్డు అందజేస్తున్న దృశ్యం

అబిడ్స్: ప్రతి ఉద్యోగికి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ముఖ్య కో ఆర్డినేటర్ వేణుగోపాల్ అన్నారు. శనివారం సీనియర్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న పండల హరినాథ్‌గౌడ్ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. హరినాథ్ 35 ఏళ్లుగా రోగరహిత సమాజ కోసం ఎనలేని కృషి చేశారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ తరపున వైద్యరంగంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తూ ఎనలేని కృషి చేస్తున్నందుకు హరినాథ్ గౌడ్‌కు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు 2025ను కౌన్సిల్ సభ్యులు అందజేసి ఘనంగా సన్మానించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోనిశమ్‌రావ్ ముదిరాజ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పవన్ రెడ్డి, రాష్ట్ర సీనియర్ నాయకుడు టీఎన్జీవోస్ ఉపాధ్యక్షుడు, గాంధీ ఆసుపత్రి బయో కెమిస్ట్ మాచర్ల రవీందర్, కొత్త మనోహర్ ముదిరాజ్, మానిక్ రావ్ హరినాథ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పురస్కారం ప్రదానం



పద్మజ విశ్వాస్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న సినీనటుడు సుమన్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జానపద సంగీత గురువు పద్మజ విశ్వాస్‌చే జనపదం-జానపదం అనే సంగీత కార్యక్రమాన్ని శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ..జీవన పరమార్థం శాంతి సామరస్యం, అనురాగ బంధాలని వాటిని పరిరక్షించేంది సంగీత సాహిత్య కళలే అన్నారు. అనంతరం ఆమెకు నవ కళ తరంగిని అనే బిరుదును ప్రదానం చేశారు. అంతకు ముందు ఆమె ఆలపించిన పలు జానపద గీతాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యువ కళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ, జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్ర, చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు పాలపర్తి సంధ్యారాణి, రఘుశ్రీ, వేణుగీతిక తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మెట్టు సాయికుమార్

గన్‌ఫౌండ్రీ: గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులను కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ కోరారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బేగంబజార్, సిద్ధంబర్ బజార్, బేగంబజార్ ఛత్రి ప్రాంతాల్లో రోడ్డు వెడల్పు, జీహెచ్‌ఎంసీలో పెండింగ్ ఉన్న పనులు, ఇసామియా బజార్లో మోడల్ మార్కెట్ నిర్మాణం వంటి పనులను తక్షణమే ప్రారంభించాలని కోరారు. ఆగస్టులో నిర్వహించబోయే గంగ తెప్పోత్సవానికి నిధులను కేటాయించాలని, అన్ని రకాల ఏర్పాట్లను సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు



అబ్దుల్ రహీం తదితరులతో టీఎఫ్‌సీఓ చైర్మన్ మహ్మద్ నజీబ్

గోల్కొండ: సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు వస్తుందని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. గత రంజాన్ మాసంలో టోలిచౌకీ, షేక్‌పేట్, గోల్కొండ, లంగర్‌హౌస్ తదితర ప్రాంతాల్లో నిరుపేద ముస్లింలకు నిత్యావసరాలు అందించిన వారిని శనివారం ఆయన తన కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బక్రీద్ సందర్భంలో కూడా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వారిని కోరారు. అదే విధంగా గోల్కొండ కోట బోనాలకు వచ్చే భక్తులకు ఊరేగింపులు జరిగే ప్రాంతాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేస్తున్నామని తమ తమ సేవలను హెల్ప్ డెస్కులలో అందించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఉమర్, బాబర్, జావిద్, రహమాన్, టీఎఫ్‌సీఓ కార్యాలయ ఇన్‌చార్జి మహ్మద్ ఫహాద్ తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్ ఏసీపీగా సుదర్శన్



అబిడ్స్: గోషామహల్ డివిజన్ ఏసీపీగా ఎస్.సుదర్శన్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. కొంత కాలంగా డివిజన్ ఏసీపీగా పనిచేసిన కోట్ల వెంకటరెడ్డి డీజీపీ కార్యాలయానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో మహబూబ్‌నగర్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్.సుదర్శన్‌ను డీజీపీ జితేందర్ నియమించారు. ఈ సందర్భంగా ఏసీపీ సుదర్శన్ మాట్లాడుతూ..శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తామన్నారు. ధూల్‌పేట్ మంగళ్‌హాట్ ప్రాంతాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయాలు జరుగకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పూర్తిగా నివారిస్తామన్నారు.

మంత్రిని కలిసిన ఊరేగింపు కమిటీ సభ్యులు



యాకుత్‌పురా: భాగ్యనగర్ మహంకాళి బోనాల జాతర ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర రవాణా శాఖ, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం తరపున అవసరమైన ఏర్పాట్లు చేయాలని మంత్రిని కోరమని వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలోఅధ్యక్షుడు రఘువేందర్, సభ్యులు గురునాథ్ రెడ్డి, మాణిక్ ప్రభు గౌడ్, శ్రీకాంత్, మారుతి యాదవ్, జగ్మహన్ కపూర్, మధుసూదన్‌గౌడ్, సతీష్ కుమార్, అరవింద్‌కుమార్‌గౌడ్, వెంకటేష్, శ్రీని వాస్, రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రినాకలో అప్రకటిత విద్యుత్ కోతలు

చాంద్రాయణగుట్ట: ఛత్రినాక ఏఈ కార్యాలయ పరిధిలో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుండడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రాత్రి, పగలు అని తేడాలేకుండా గంటల తరబడి కోతలు విధించడంపై వినియోగదారులు మండిపడుతున్నారు. ఎండలు కొట్టినప్పుడు విద్యుత్ డిమాండ్ పెరిగిందని, వర్షాలు కురిసినప్పుడు లైన్ ట్రిప్ అవుతుందంటూ సరఫరా నిలిపివేస్తుండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలానికి ముందే చెట్ల కొమ్మల కత్తిరింపు పేరుతో అధికారికంగా సరఫరా నిలిపివేసే అధికారులు, తిరిగి చిన్నపాటి వర్షానికే చెట్లు లైన్‌పై పడ్డాయంటూ మళ్లీ కోతలు విధించడం ఛత్రినాక పరిసర బస్తీల్లో పరిపాటిగా మారింది. సరఫరాలో అంతరాయం కలిగాకే స్పందిస్తున్న అధికారులు.. ముందస్తుగా సరఫరాకు కలిగే అవాంతరాలపై అధ్యయనం చేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నెల నెలా విద్యుత్ బిల్లులను వసూలు చేస్తున్న అధికారులు, అదేరీతిలో అంతరాయం లేని సరఫరా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఘనంగా పౌర హక్కుల దినోత్సవం



గోల్కొండ: పౌర హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చట్టాలు రూపొందించిందని షేక్‌పేట్ మండల కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం షేక్‌పేట్‌లోని వినోబానగర్‌లోని భగత్‌సింగ్ కమ్యూనిటీహాల్‌లో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అత్యున్నతమైన భారత రాజ్యాంగం భారత పౌరులకు ఎన్నో హక్కులు ఇచ్చిందని అన్నారు. హక్కులతో పాటు బాధ్యతలను కూడా నేరవేర్చాలన్న విషయం రాజ్యాంగంలో పొందుపరచడమైందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓ నర్సింహారెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాను, రికార్డు అసిస్టెంటు నవీన్‌తో పాటు షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



డిప్యూటీ కమిషనర్ దుబ్బాక లావణ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని అబిడ్స్ జీహెచ్‌ఎంసీ 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దుబ్బాక లావణ్య పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో పలు ప్రాంతాల్లో నాలాల పూడికతీత పనులు వేగవంతంగా చేపట్టాలని ఆమె అధికారులను ఆదేశించారు. శనివారం గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆమెకు వినతిపత్రం అందజేసి పూడికతీత పనులు వేగవంతంగా చేపట్టాలని సూచించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ..ప్రతిరోజు ఈఈ, డీఈలు, ఏఈలు అన్ని ప్రాంతాల్లో పర్యటించి వర్షాకాలం ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు ప్రాంతాల్లో పర్యటించి కచ్చ మోరీలు, మురుగునీటి కాలువలు, నాలా పూడికతీత పనులు వేగంగా చేపట్టాలన్నారు.

ఘనంగా అహల్యా బాయి హోల్కర్ జయంతి



ర్యాలీలో పాల్గొన్న లంకల దీపక్‌రెడ్డి, గౌతమ్‌రావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: అహల్యా బాయి హోల్కర్ చేసిన సేవలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి అన్నారు. శనివారం బీజేపీ సెంట్రల్ శాఖ ఆధ్వర్యంలో అహల్య బాయి హోల్కర్ జయంతి సందర్భంగా బషీర్‌బాగ్‌లోని కనకదుర్గమ్మ ఆలయం నుంచి ట్యాంక్‌బండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అహల్య బాయి హోల్కర్ ప్రజల కోసం జీవించిందని ఆయన వివరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఆమె పాలనా కాలంలో ఆ ప్రాంత అభివృద్ధికి కృషి చేసిందని వ్యాఖ్యానించారు. బీజేపీ సీనియర్ నేత గౌతమ్ రావు ,బీజేపీ నేతలు శిల్పారెడ్డి, ఆనంద్‌గౌడ్, కిలారి మనోహర్, కేశబోయిన శ్రీధర్, వనం రమేష్, అవినాష్ పాల్గొన్నారు.

మంత్రులకు ఆహ్వానం



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానిస్తున్న చంటిబాబు తదితరులు

లంగర్‌హౌస్: గోల్కొండ బోనాల ప్రారంభానికి వచ్చి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గోల్కొండ జగదాంబిక బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ చంటిబాబు ఆధ్వర్యంలో శనివారం మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చైర్మన్ చంటిబాబు మాట్లాడుతూ..లంగర్‌హౌస్ నుంచి ప్రారంభమయ్యే బోనాల ఉత్సవాల సందర్భంగా ఈ ఏడాది కూడా ప్రభుత్వం తరపున మంత్రులు పట్టువస్త్రాలు సమర్పించనున్నారన్నారు. తనకు బోనాల నిర్వహణ బాధ్యతలు అప్పగించిన సందర్భంగా మంత్రులను కలిసి ధన్యవాదాలు తెలిపామన్నారు. ఉస్మాన్ హజ్రి సమక్షంలో మంత్రులను బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీకాంత్, సంతోష్‌గౌడ్, యాదగిరి, అనిత కలిసి ఆహ్వానించారు.

పదవీ విరమణ

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో మూడున్నర దశాబ్దాల పాటు డి.వసంతరావు పాటీల్ సేవలందించారు. 36 ఏళ్లుగా ప్రభుత్వ రంగంలో అనేక బాధ్యతలు నిర్వర్తించి విశేష సేవల అనంతరం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా శనివారం కోఠిలోని ఐఎంఏ హాల్‌లో పదవీ విరమణ సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి ప్రముఖులు, ఉద్యోగ సంఘాల నేతలు, శ్రేయోభిలాషులు హాజరై వసంతరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి, డాక్టర్ రాజశేఖర్, టీజీఓ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్, సత్యనారాయణ, కృష్ణ యాదవ్, మల్లేష్, శ్రీనివాస్, సునీల్‌రాజ్ పాల్గొన్నారు.



బక్రీద్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ శ్రీను

గౌలిపురా: బక్రీద్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవాలని మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ శ్రీను సూచించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో శనివారం విక్రయదారులతో ఇన్‌స్పెక్టర్ శ్రీను సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీను మాట్లాడుతూ.. బక్రీద్ సందర్భంగా జంతువుల విక్రయదారులు పోలీసుల సూచనలు, సలహాలను తప్పకుండా పాటించాలన్నారు. జంతువుల విక్రయదారులు ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వెటర్నరీ వైద్యుల సర్టిఫికెట్లతో విక్రయాలు చేపట్టాలన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కవిత

గన్‌ఫౌండ్రీ: మహిళా రచయిత్రులు రావాల్సిన అవసరం ఎంతగానో ఉందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం ఆమె నివాసంలో యువ రచయిత్రి కరిష్మా సింగ్ రచించిన జస్ట్ బికాస్ ఐ క్యారీ ఇట్ వెల్ డస్ నాట్ మీన్ ఇట్స్ నాట్ హెవీ, దేవదాస్ అనే పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..21 ఏళ్ల వయస్సు కలిగిన రచయిత్రి ఎన్నో అంశాలపై పరిశోధనలు చేసి పుస్తకాలను రాయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సారికా సింగ్, నిఖితా సింగ్, మనీష్ సింగ్, న్యాయవాది రాజ్ నందిని సింగ్, కార్తీక్ సింగ్, శంకర్ సింగ్, ఆనంద్‌సింగ్ లోథ్, పప్పు మాత్రే, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'కష్టపడి పని చేస్తేనే సంస్థ లాభాల బాట పడుతుంది'



మాట్లాడుతున్న సుధా పరిమళ

గోల్కొండ: కష్టపడి పని చేస్తేనే సంస్థ లాభాల బాట పడుతుందని టీజీఆర్టీసీ రిజనల్ మేనేజర్ సుధా పరిమళ అన్నారు. రిజనల్ మేనేజర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మొదటిసారి మెహిదీపట్నం ఆర్టీసీ డిపోకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె డిపోలోని గ్యారేజ్ సెక్షన్, ట్రాఫిక్ సెక్షన్, ఆఫీస్ తదితర విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె అందుబాటులో ఉన్న బస్సు కండక్టర్లు, డ్రైవర్లతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం ప్రయాణికుల్లో తమ సంస్థకు ఆదరణ పెరిగిందన్నారు. క్రమ శిక్షణతో సిబ్బంది పని చేస్తుండమే దీనికి కారణమన్నారు. అనంతరం ఆమె మెహిదీపట్నం రైతు బజార్ ఎదురుగా హెచ్‌ఎండీఏ వారు నిర్మిస్తున్న స్కైవాక్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ బి.వి.కృష్ణమూర్తి, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సరస్వతీ, ఏఈ రహమాన్, ఆఫీస్ సూపరింటెండెంట్ కొండల్‌రావు తదితరులున్నారు.

సన్మానం

గోల్కొండ: సబ్జిమండి గంగపుత్ర సంఘం జగదాంబిక మహంకాళి అమ్మవారి ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కట్ట శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సబ్జిమండీలోని గంగపుత్ర భవనంలో జరిగిన సంఘం సమావేశంలో సభ్యులంతా ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కట్ట శ్రీనివాస్ మాట్లాడుతూ..తమ సంఘం నుంచి ప్రతియేటా గోల్కొండ కోటలో జరిగే అమ్మవార్ల బోనాల సందర్భంగా అమ్మవార్లకు పట్టువస్త్రాలు, బోనం సమర్పించే ఆనవాయితీని కొనసాగిస్తామన్నారు. జూలై 6న జరిగే కోట అమ్మవార్ల బోనాలకు సబ్జిమండి నుంచి భారీ ఊరేగింపుతో బయలుదేరుతామన్నారు. ఈ కార్యక్రమంలో వేణుబాబు, ఆర్.కె.భగవాన్, ఆర్.కె.మైసయ్య, నర్సింగ్ రావు, కట్ట అంజయ్య, పల్లెల అరుణ్‌కుమార్, సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



కట్ట శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం